సాక్షి
యాదాద్రి భువనగిరి

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



అత్తపై దాడి చేసిన అల్లుడు

భార్యను కాపురానికి పంపడం లేదని అత్తపై అల్లుడు గొడ్డలితో దాడి చేసిన ఘటన రాగిబావిలో చోటు చేసుకుంది. - 8లో



సినీ ఫక్కీలో దొంగతనం

గుర్తుతెలియని వ్యక్తి సినీ ఫక్కీలో బంగారం, నగదు దోచుకెళ్లిన ఘటన తుక్కాపురంలో వెలుగులోకి వచ్చింది. - 8లో



అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం స్వయంభూలకు బిందెతీర్థం, ఆరాధన గావించారు. శ్రీస్వామి వారికి బాల భోగం చేపట్టిన తరువాత మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించి, అలంకరించారు. శ్రీస్వామివారికి విశేషంగా పూజలు చేపట్టారు. ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలను నిర్వహించారు. రాత్రి పవళింపు సేవను నిర్వహించి, ఆలయాన్ని మూసివేశారు.

బీజేపీతోనే అభివృద్ధి



గుట్టలో మట్టిని సేకరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, నాయకులు

యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు అన్నారు. మేరీ మిట్టి.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలో పలు ఇళ్లలో మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరుల స్మారకార్థం ఢిల్లీ నిర్మించే అమృత్ వాటిక స్థూపం కోసం మట్టిని సేకరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవుల నరేందర్, నియోజకవర్గ కన్వీనర్ చిరిగే శ్రీనివాస్, జిల్లా కోశాధికారి కాధూరి అచ్చయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు భువనగిరి శ్యాంసుందర్, తాళ్ల భాస్కర్‌రెడ్డి, రంగ సత్యం, నంగునూరి బాలరాజు, జంపాల శ్రీనివాస్, కర్రె లక్ష్మయ్య, బొమ్మగాని రాజమణి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న గూడూరు

భువనగిరి టౌన్: తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో భువనగిరి కలెక్టరేట్ వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. పదిహేనేళ్లుగా సేవలందిస్తున్న దాదాపు 21వేల మంది ఉద్యోగ భద్రత కల్పించాలని దీక్ష చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరణమన్నారు. ఈ దీక్షలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మంగ పండరి, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మాట భాస్కర్ నాయకులు రవిప్రసాద్, విజయ కుమార్, శ్రావణ్ , తిరుపతి, మోహనాచారి, శ్రీనివాస్, చందర్, కృష్ణ, బాలయ్య, సంజీవ, సునీత నవిత, కిషోర్ రాధిక అన్నపూర్ణ పుష్పలత పాచయ్య, శ్రీకాంత్ భవాని అన్ని విభాగాల సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నాం

భువనగిరి టౌన్: రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పకడ్బందీగా అమలు చేస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ కలెక్టర్ భాస్కరరావు తెలిపారు. బుధవారం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం భారత దర్శన్ కార్యక్రమంలో భాగంగా భువనగిరికలెక్టరేట్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలును బృందానికి వివరించారు. ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 71 మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు వివిధ సర్టిఫికెట్లు సకాలంలో అందిస్తున్నామన్నారు. ఇతర సేవలకు దరఖాస్తులు కూడా ఆయా కేంద్రాల్లోనే ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి నిధులొచ్చాయ్!

పల్లెలు, పట్టణాల్లో వసతుల కల్పనకు రూ.46 కోట్లు

- టీయూఎఫ్ఐడీసీ, సీడీపీ ఫండ్ ద్వారా విడుదల చేసిన ప్రభుత్వం
- రెండు నియోజకవర్గాలు, మరో రెండు మున్సిపాలిటీలకు..
- పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు



సాక్షి,యాదాద్రి: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లోని గ్రామాలకు, అలాగే యాదగిరిగుట్ట, ఆలేరు మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను నిధులు విడుదల చేసింది. నియోజకవర్గాలకు ఒక్కోదానికి రూ.3కోట్ల చొప్పున మొత్తం రూ.6కోట్ల నియోజకవర్గ అభివృద్ధి ప్రోగ్రాం (సీడీపీ) నిధులు విడుదల అయ్యాయి. అలాగే తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ ఐడీసీ) ద్వారా యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి రూ.25కోట్లు, ఆలేరు మున్సిపాలిటీకి రూ.15కోట్లు నిధులు విడుదలయ్యాయి. మొత్తంగా రెండు నియోజకవర్గాలు, రెండు మున్సిపాలిటీలకు కలిపి మొత్తం రూ.46కోట్లు విడుదలయ్యాయి.

మున్సిపాలిటీల్లో పనుల ప్రతిపాదనలు ఇలా..

గతంలో వచ్చిన టీఎఫ్ఐయూడీసీ నిధులు సక్రమంగా వినియోగించ లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. అవసరం లేనిచోట నిధులను ఖర్చు చేశారు. దీంతో ఈ సారి అలా కాకుండా అవసరం ఉన్నచోట నిధులను ఖర్చు చేయడానికి పాలకవర్గం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో 12 వార్డుల్లో అవసరం ఉన్నచోట్లలో రూ.10 కోట్లతో మురుగు కాలువల నిర్మాణాలకు ప్రతిపాదించారు. శిథిలమైన పాత మున్సిపాలిటీ స్థలంలో రూ.3 కోట్లతో నూతన మున్సిపాలిటీ నిర్మాణం, రూ.2 కోట్లతో ఆలేరు ప్రధాన రహదారి పక్కన ప్లాట్ ఫాంల నిర్మాణం చేపట్టనున్నారు.

యాదగిరిగుట్టలో..

యాదాద్రి పుణ్య క్షేత్రం అభివృద్ధి తర్వాత మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డుల్లో పలు సమస్యలు తిష్ట వేశాయి. నిత్యం భక్తులు, యాత్రికులు, పర్యాటకులతో రద్దీగా ఉండే యాదగిరిగుట్టలో మురుగు కాలువలు, సీసీ, డాంబరు రోడ్లు ధ్వంసమయ్యాయి. అయితే ప్రధానంగా అవసరం ఉన్నచోట టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.25 కోట్లు విడుదల కావడంతో ఆయా చోట్లలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ.17 కోట్లతో 12వార్డుల్లో అండర్‌గ్రౌండ్, ఓపెన్ డ్రైనేజీ నిర్మాణాలు, రూ.5 కోట్లతో ఆయా వార్డులలో సీసీ రోడ్లు, రూ.3 కోట్లతో యాదగిరిగుట్ట నుంచి పాత గుట్ట వరకు బీటీ రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు సాంకేతిక అనుమతుల కోసం నివేదిక పంపించారు.

నియోజకవర్గాల్లో..

భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల అభివృద్ధికి ఇటీవల ఒక్కో నియోజకవర్గానికి రూ.3 కోట్ల చొప్పున రెండింటికి మొత్తం రూ.6 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం విడుదలైన నిధుల్లో భువనగిరి నియోజకవర్గంలో రూ.36 లక్షలతో 21 పనులకు, ఆలేరు నియోజకవర్గంలో రూ.2.15 కోట్లతో 59 పనులు చేపట్టడానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మిగతా నిధులతో వివిధ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. అయితే ఎన్నికల వేళ నిధులు మంజూరు చేయడంతో ఇంతకాలం డబ్బుల్లేక చిన్న చిన్న పనులు చేపట్టలేని మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఆయా పాలకవర్గాలకు ఊరట లభించినట్టయ్యింది. టీయూఎఫ్ఐడీసీ నిధులతో మున్సిపాలిటీల్లో, అలాగే సీడీపీ నిధులతో నియోజకవర్గాల్లోని మండల కేంద్రాలు, గ్రామాల ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి సిద్ధం అవుతున్నారు.

పక్కాగా అభ్యర్థుల ఎంపిక



యాదగిరిగుట్టలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ మానే

- ఐదు హామీల గ్యారంటీ కార్డును ప్రతి ఇంటికీ చేర్చాలి
- కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ మానే
- భువనగిరి, యాదగిరిగుట్టలో పార్టీ ముఖ్యనేతల సమావేశాలు



భువనగిరిలో మాట్లాడుతున్న శ్రీనివాస్ మానే, చిత్రంలో డీసీసీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి/యాదగిరిగుట్ట: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక ఆషామాషీగా జరగదని, సూక్ష్మంగా పరిశీలించి పక్కాగా గెలిచే అభ్యర్థులనే ఎంపిక చేసి టికెట్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి, కర్ణాటక రాష్ట్రంలోని హంగల్ ఎమ్మెల్యే శ్రీనివాస్ మానే అన్నారు. బుధవారం భువనగిరి, యాదగిరిగుట్టలో పార్టీ ముఖ్యనేతలు, భువనగిరి, ఆలేరు ఎమ్మెల్యే టికెట్లు ఆశిస్తున్న దరఖాస్తుదారులు, బూత్ లెవల్ ప్రతినిధులతో వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం వల్ల దేశంలో పార్టీకి పునర్ వైభవం వచ్చిందన్నారు. కర్ణాటక విధానంతో తెలంగాణలో విజయం సాధిస్తే కేంద్రంలోనూ అధికారలోకి వస్తుందన్నారు. ఇందుకోసం కాంగ్రెస్ కేంద్ర కమిటీ ప్రజలకు ఇచ్చిన ఐదు హామీల గ్యారెంటీ కార్డును ప్రతి ఇంటికి చేరే విధంగా డీసీసీ అధ్యక్షుడి నుంచి బూత్‌స్థాయి ఏజెంట్ల వరకు కష్టపడి పనిచేయాలన్నారు. ఇండియా కుటమి ఏర్పాటుతో మోదీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఎన్నికలు అత్యంత ముఖ్యమన్నారు. పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేనిఫెస్టోను కూడా చూపించాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కర్ణాటక తరహాలో హామీలు అమలు చేస్తామన్నారు. ఈ నెల 17వ తేదీన నిర్వహించే కాంగ్రెస్ బహిరంగ సభను విజయవంతం చేసి సత్తాచాటాలన్నారు.

ఆ లీడర్లకు టికెట్ ఇవ్వొద్దు

ఎన్నికల ముందు ఇతర పార్టీల నుంచి వచ్చే పారాచూట్ లీడర్లకు టికెట్లు ఇవ్వొద్దని భువనగిరిలో దరఖాస్తు దారులు ముక్త కంఠంతో నినదించారు. టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న భువనగిరి అసెంబ్లీ కాంగ్ర్ ఆశావహులు తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా ఓకే అన్నారు. కోవర్టులుగా పనిచేస్తున్న వారిని గుర్తించి పార్టీ నుంచి తొలగించాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో భువనగిరిలో కసిరెడ్డి నారాయణరెడ్డి, పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, పోత్నక్ ప్రమోద్‌కుమార్, తంగెళ్లపల్లి రవికుమార్, పంజాల రామాంజనేయులుగౌడ్, పాక మల్లేష్, వాకిటి అనంతరెడ్డి, బర్రె జహంగీర్, నాయకులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ నేత జ్యోతీష్ , బర్రె నరేష్, దర్గాయి హరిప్రసాద్, యాదగిరిగుట్ట సమావేశంలోలో మాజీ ఎమ్మెల్యే కుడుదుల నగేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి బోరెడ్డి అయోధ్యరెడ్డి, ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య, ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి, రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, ఎంపీపీలు చీర శ్రీశైలం, గంధమల్ల అశోక్, తండ మంగమ్మ శ్రీశైలం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, యాదగిరిగౌడ్, ఆయా మండలాల అధ్యక్షులు ఉన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, చిత్రంలో అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సాక్షి, యాదాద్రి: అర్హులంతా ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కల్పించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో వారం నుంచి ఇప్పటి వరకు జరిగిన ఓటరు జాబితా సవరణ వివరాలు, బూత్ లెవల్ ఏజెంట్ల నియామకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆగస్టు 21 తేదీ వరకు భువనగిరి–94, ఆలేరు (97) అసెంబ్లీ నియోజక వర్గాల ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించామన్నారు. భువనగిరి నియోజకవర్గానికి సంబంధించి 2,06,883 ఓటర్లు, ఆలేరులో 2,20,638 ఓటర్లుగా మొత్తం 4,27,471 ఓటర్లు ఉన్నారన్నారు. రెండో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం ద్వారా ఈనెల 19 వరకు మార్పులు, చేర్పులు, తొలగింపులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిలాళ్ల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, పార్టీల ప్రతినిధులు బట్టు రామచంద్రయ్య, కూర వెంకటేశ్, బట్టుపల్లి అనూరాధ, ఏవీ. కిరణ్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, డీటీ సురేష్ పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాము తనిఖీ

భువనగిరి టౌన్: నెలవారీ తనిఖీల్లో భాగంగా బుధవారం భువనగిరి కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదామును కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ఆర్డీఓ అమరేందర్, సర్వేయర్ దేవా, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ ఉన్నారు.


ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

భువనగిరి టౌన్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) స్కీంలో పనిచేస్తున్న ఆల్ క్యాడర్స్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు భువనగిరి కలెక్టరేట్ ఎదుట 7వ రోజైన బుధవారం చేపట్టిన నిరవధిక సమ్మెలో ఆయన మాట్లాడారు. ఈ సమ్మెలో ఏఐటీయూసీ నేత గనబోయిన వెంకటేష్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కామ్రాన్, వినోద్, దుర్గ, సౌజన్య, మధు, శ్రీదేవి, రమేష్, సరిత, భార్గవి, శిరీష ఉన్నారు.

మత్స్యకారులకు ఆర్థిక భరోసా!

చెరువులన్నీ మత్స్యశాఖ పరిధిలోకి

- లీజు బాధ్యత కూడా ఆ శాఖకే..
- వేలం ఆదాయం పంచాయతీలకు
- జిల్లాలో 1,135 చెరువులు



మత్స్యశాఖ ఆధీనంలోకి వెళ్లి మోత్కూరు చెరువు

భువనగిరి టౌన్: మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. ఇప్పటి వరకు పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను మత్స్యశాఖ ద్వారా సహకార సంఘాలకు లీజుకు ఇచ్చేలా ప్రభుత్వం జీఓ జారీ చేసింది. దాంతో పంచాయతీ రాజ్ పరిధిలోని చెరువులపై మత్స్యశాఖకు పూర్తి అధికారులు దక్కనున్నాయి. యాదాద్రి జిల్లాలో 161 పెద్ద చెరువుల, 954 చిన్న చెరువులు, మూసీ పరీవాహక ప్రాంతంలో 20 వరకు ఉన్నాయి. చెరువులు, కుంటలు మత్స్యశాఖ, మత్స్య సహకార సంఘాల ఆధీనంలోకి వచ్చాయి. ఇప్పటి వరకు లీజు విషయంలో మత్స్యకారులకు ఎదురైన సమస్యలు, ఇబ్బందులు తొలగడంతోపాటు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది. కొందరు సర్పంచ్‌లు స్వాధీనం చేయకపోవడంతో అధికారులు జిల్లా పంచాయతీ అధికారికి లేఖ ద్వారా తెలియజేశారు.

జీఓ 268తో మత్స్యశాఖ పరిధిలోకి..

గతంలో చేపల పెంపకానికి అవసరమైన చెరువులు పంచాయతీరాజ్, మత్స్యశాఖ ఆధీనంలో ఉండేవి. 100 ఎకరాల్లోపు కుంటలు, చెరువులు పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో ఆ లోపు విస్తీర్ణం ఉన్నవి మత్స్యశాఖ పరిధిలో ఉన్నాయి. అన్నిరకాల చెరువులకు ప్రభుత్వమే ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసి పెంపకాన్ని ప్రోత్సహించేది. ప్రస్తుతం ప్రభుత్వం జారీ చేసిన జీఓ 268తో 1,135 చెరువులు మత్స్యశాఖ పరిధిలోకి వెళ్లాయి.

తీరనున్న ఇబ్బందులు

మత్స్య సహకార సంఘాలు, పంచాయతీల ఆధీనంలో ఉండే నీటి వనరులను లీజుకు తీసుకునే విషయంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి. గతంలో పంచాయతీ నిబంధనలు పరిగణలోకి తీసుకోకుండా లీజుకు ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంతో అధికారాలన్నీ మత్స్యశాఖ పరిధిలోకి వెళ్లనున్నాయి. సొసైటీలు ఉన్న చోట వారికే చెరువుపై హక్కులు దక్కనుండడంతో మత్స్యకారుల ఆదాయం కూడా పెరగనున్నది.

పంచాయతీలకే వేలం డబ్బులు

పంచాయతీ పరిధిలోని చెరువులు మత్స్యశాఖ పరిధిలోకి రావడంతో వాటికి వేలం ద్వారా లీజు నిర్ణయించి వచ్చిన ఆదాయాన్ని చెరువు పరిధిలోని పంచాయతీలకు అందించేలా మత్స్యశాఖ ఏర్పాట్లు చేస్తుంది. పంచాయతీల పరిధిలోని చెరువులను లీజుకు ఇచ్చేందుకు ఇక పంచాయతీ అధికారులకు అధికారం లేదు. జిల్లాలోని మత్స్యశాఖ పరిధిలోని 790 చెరువులకు ఇప్పటికే చేప పిల్లల పంపిణీ పూర్తి చేశారు.

ఆధీనంలోకి తీసుకున్నాం

జిల్లాలో ఉన్న అన్ని చెరువులను మత్స్యశాఖ తన ఆధీనంలోకి తీసుకుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లీజు నిర్ణయించి వచ్చిన ఆదాయం గ్రామ పంచాయతీలకు అందజేస్తాం. పంచాయతీల ఆధీనంలోని చెరువులను మత్స్యశాఖ అనుమతి లేకుండా ఎవరూ లీజుకు తీసుకోవద్దు. నిబంధనలకు విరుద్ధంగా లీజుకు తీసుకుంటే చట్టపరంగా చర్యలు ఉంటాయి. చెరువుల లీజు ప్రకటన కుడా మత్స్యశాఖ విడుదల చేస్తుంది.

–రాజారాం, మత్స్యశాఖ జిల్లా అధికారి

'చేనేత మిత్ర' కొందరికేనా..

- త్రిఫ్టు పథకంలో చేరిన వారికే వర్తింపజేస్తున్న అధికారులు
- ఆందోళన చెందుతున్న మిగతా కార్మికులు
- జియోట్యాగ్ నంబర్లున్న వారందరికీ లబ్ధి చేకూర్చాలంటున్న కార్మికులు



ఈ ఫొటో ఉన్న చేనేత కార్మికుడు పెంట లక్ష్మీనారాయణ. ఇతనిది యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం బేగంపేట గ్రామం. ఈయన చిన్ననాటి నుంచి మగ్గం నేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. జియోట్యాగ్ ఉన్నా.. త్రిఫ్టు పథకంలో సభ్యుడిగా చేరలేదు. లక్ష్మీనారాయణకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. కుమారులు బాలు, భానులకు వివాహం కాగా వీరు కూడా మగ్గం నేస్తున్నా జియో ట్యాంగ్ నంబర్లు రాలేదు. ఇతని భార్యను కూడా అనుబంధ కార్మికురాలిగి గుర్తించలేదు. అధికారుల అలసత్వంతో తన కుటుంబంలో ఏ ఒక్కరికీ పథకం అందలేదని లక్ష్మీనారాయణ వాపోయారు.

రాజాపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకునేందుకు త్రిఫ్టు, చేనేత బీమాతోపాటు కొత్తగా చేనేత మిత్ర పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ప్రతి కార్మికుడికి ప్రతినెలా రూ.2వేలు, అనుబంధ కార్మికురాలు (అంచల్ వర్గర్)కు రూ.వెయ్యి చొప్పున అందించాలని ప్రభుత్వం భావించింది. కానీ, అధికారులు మాత్రం త్రిఫ్టు పథకంలో చేరినవారిని మాత్రమే చేనేత మిత్ర పథకానికి అర్హులుగా పరిగణనలోకి తీసుకోవడంతో మిగతా కార్మికులు అందోళన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో కార్మికుల సంఖ్య	15 వేలకు పైగా
యాదాద్రిలో	13వేలు
జియోట్యాగ్ నంబర్లు ఉన్నవారు	5,698
త్రిఫ్టు పథకంలో సభ్యులు	11, 300



జరుగుతుందిలా..

అధికారులు జియో ట్యాగ్ ఉన్న ప్రతి కార్మికుడికి చేనేత మిత్ర పథకం ఇవ్వడం లేదు. ఆర్థిక స్థోమత లేక ఇబ్బందుల కారణంగా కొందరు చేనేత కార్మికులు త్రిఫ్టు పథకాన్ని కొనసాగించలేకపోయారు. మరికొందరు చేనేత రంగంలో జీవనోపాధి కరువై బతుకుదెరువు నిమిత్తం మగ్గం నేయడం మానివేసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఇంకొంతమంది ఇతర ప్రాంతాలకు వెళ్లి తిరిగి వచ్చి చేనేత మగ్గాలను నేస్తున్నవారు. వీరి కోసం కొత్తగా అధికారులు జియోట్యాగ్ నంబర్లను ఏర్పాటు చేశారు. అయితే దరఖాస్తు చేసుకున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని, క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడం వల్లే అర్హులైన కార్మికులకు సకాలంలో పథకాలు అందకుండా పోతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉంటే కొత్తగా జియోట్యాగ్ ఏర్పాటు చేసిన వారికి అధికారులు తీసుకున్న నిర్ణయంతో దాదాపు 1,700 మందికిపైగా చేనేతమిత్ర పథకం అందకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జియోట్యాగ్ ఉన్న ప్రతి కార్మికుడికి చేనేత మిత్ర పథకాన్ని అందివ్వాలని కోరుతున్నారు.

పథకాలు అందడం లేదు



చిన్ననాటి నుంచి మగ్గం నేస్తూ జీవనోపాధి పొందుతున్నాను. కొత్తగా జియోట్యాగ్ నంబర్ ఇచ్చారు కానీ, ప్రభుత్వం పథకాలైన త్రిఫ్టు, చేనేత మిత్రకు అర్హుడిని కాకుండా పోయాను. మాలాంటి పేదలకు పథకాలు అందేలా చూడాలి.


– నక్క మాధవులు రాజాపేట

ప్రతి కార్మికుడిని ఆదుకోవాలి

త్రిఫ్టు పథకంలో చేరినవారిని మాత్రమే చేనేత మిత్ర పథకానికి అర్హులుగా గుర్తిస్తే మిగతా కార్మికులకు అన్యాయం జరుగుతుంది. జియోట్యాగ్ ఉన్న ప్రతి కార్మికుడికి చేనేత మిత్ర అందజేసి ఆదుకోవాలి.

– చుంచు నారాయణ, చేనేత మ్యాక్స్ సొసైటీ ఉపాధ్యక్షుడు, రాజాపేట

వారంలోగా పూర్తి గైడ్‌లైన్స్ వస్తాయి



చేనేత మిత్ర పథకంపై వారంలోగా పూర్తి గైడ్‌లైన్ వస్తాయి. జియోట్యాగ్ ఉన్న ప్రతి కార్మికుడికి చేనేత మిత్ర అందించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రతి కార్మికుడికి ప్రభుత్వ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– విద్యాసాగర్ చేనేత జౌళి శాఖ ఏడీ, యాదాద్రి భువనగిరి జిల్లా

బదిలీల దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

భువనగిరి: జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల కోసం ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. డీఈఓ కె.నారాయణరెడ్డి పర్యవేక్షణలో బుధవారం మొదటి రోజు దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. కాగా శుక్రవారం పరిశీలన ప్రక్రియ ముగియనుంది. కాగా దరఖాస్తు చేసుకునే ప్రక్రియ మంగళవారం ముగిసింది. మొత్తం 2,260 మంది ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో జీఓ నంబర్ 317కు సంబంధించిన ఉపాధ్యాయులు సుమారు 224 మంది ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి



మొక్క నాటుతున్న శేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి

భువనగిరి: ఆయిల్ పామ్ తోటల సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్‌కార్పొరేషన్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం భువనగిరి మండలం సిరివేణికుంటలో ఎమ్మెల్యే, చైర్మన్, అలాగే వలిగొండ మండలం నెమిలికాల్వ గ్రామంలో కంచర్ల పలువురు రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మన్ జడల అమరేందర్, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ ఎండీ సురేందర్‌రెడ్డి, ఓఎస్ఓ చంద్రమోహన్, ఆయిల్ పామ్ సలహాదారు రాజశేఖర్ రెడ్డి , విశ్రాంత జస్టిస్ వంగాల ఈశ్వరయ్య, జిల్లా హార్టికల్చర్ అధికారి అన్నపూర్ణ, ఎంపీపీ నరాల నిర్మలవెంకటస్వామి యాదవ్, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సంజీవరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కంచి మల్లయ్య, సామల వెంకటేశ్, మహేందర్ నాయక్, కస్తూరి పాండు, మధుసూదన్‌రెడ్డి, కేశవపట్నం రమేష్, వెంకట్, సుధాకర్, పుట్ట వీరేశం, కవిత, బుచ్చిరెడ్డి, అనిత, మంజీనాయక్, సుర్కంటి వెంకట్‌రెడ్డి, వంగాల భిక్షపతి, వెంకన్న, లింగస్వామి, ప్రవీణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

యాదాద్రిలో భారత ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ పూజలు



ఎస్వీ కృష్ణకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని భారత ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ ఎస్వీ కృష్ణ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ప్రధానోపాధ్యాయురాలు మృతి



కవిత (ఫైల్)

సూర్యాపేట క్రైం: బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో ప్రధానోపాధ్యాయురాలు మృతిచెందింది. ఆమె భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం సూర్యాపేట పట్టణంలోని కొత్త వ్యవసాయ మార్కెట్ సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని అమ్మ గార్డెన్స్ వద్ద గల పెట్రోల్ బంక్ సమీపంలో జలగం కవిత(41), లింగయ్య దంపతులు నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కవిత పెన్‌పహాడ్ మండలంలోని సింగారెడ్డిపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా.. లింగయ్య అదే మండలంలోని అనాజిపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కృష్ణాష్టమి సందర్భంగా బుధవారం ప్రకటించిన ఐచ్ఛిక సెలవును రద్దు చేసి గురువారానికి మార్చినట్లు తెలియజేయడంతో ఉదయం భార్యాభర్తలిద్దరూ కలిసి హడావిడిగా బైక్‌పై పాఠశాలలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో సూర్యాపేట పట్టణంలోని కొత్త వ్యవసాయం మార్కెట్ సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కవిత అక్కడికక్కడే మృతిచెందగా, లింగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. లింగయ్య చికిత్స నిమిత్తం స్థానికులు సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. జనరల్ ఆస్పత్రిలోనే కవిత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. కాగా కృష్ణాష్టమి ఐచ్ఛిక సెలవును గురువారానికి మార్చినట్లు బుధవారం ఉదయం తెలియజేయడంతో కవిత, లింగయ్య అప్పటికప్పుడు పాఠశాలలకు వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అలరించిన గోపిక, కృష్ణులు

'సాక్షి' ఆహ్వానానికి విశేష స్పందన వచ్చింది. కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులను కృష్ణులుగా, గోపికలుగా అలంకరించి ఫొటోలను పంపించాలని కోరగా.. ఆ మేరకు తల్లిదండ్రులు తమ బుజ్జాయిలను అందంగా ముస్తాబు చేసి ఫొటోలను వాట్సాప్ చేశారు. చిన్నారులు అందమైన వేషధారణతో ఆకట్టుకున్నారు.



నీరటి ఇషాన్ అద్వైత్, శారాజీపేట, ఆలేరు
గోలి జశ్విక్, బ్రహ్మణపల్లి, గుండాల
సబ్బని అద్విత్, చిత్తాపురం, వలిగొండ



సబ్బని రిషిత్ చిత్తాపురం, వలిగొండ
రాళ్లబండి నిహారిక, భువనగిరి
ఈ.కృతిక, చొల్లేరు, యాదగిరిగుట్ట
అన్ను కృతి గౌడ్, గోకారం, వలిగొండ



తిరందాసు నిహాన్, కొయ్యలగూడెం, చౌటుప్పల్
శ్రీ ఆద్విక, మునిపంపుల,రామన్నపేట
హాసిని, ఆలేరు



కూరెళ్ళ శ్రీని, మోత్కూర్
గాదెనబోయిన, సాయి నక్షత్ర, మోత్కూర్
వర్షిని, యల్లగిరి, చౌటుప్పల్
బచ్చ నవదీప్, రామన్నపేట
రేపాక శ్రేయాన్ని, కొమ్మాయిగూడెం, రామన్నపేట
రేపాక ప్రజ్ఞ, కొమ్మాయిగూడెం, రామన్నపేట
ఆశ్వత్, మోత్కూరు
పులగం శ్లోక, భువనగిరి
కల్యూరి నక్షత్ర, ఆరెగూడెం, మోత్కూరు
పల్లెర్ల శ్రయాన్ష్, మోత్కూరు



రుద్రాన్ష్ రెడ్డి, మహబూబ్‌పేట, యాదగిరిగుట్ట
గంధం వేదాధ్య, మోత్కూరు
సాయి ధృతి, జీడీనగర్
ఆరాధ్య, భువనగిరి
గోదాసు, దీప్స, రామన్నపేట
బేతి కారుణ్య, ఆలేరు
బత్తుల హార్థిక్ వర్ధ, రాంనగర్, భువనగిరి
బత్తుల తనుష్ వర్ధ, రాంనగర్, భువనగిరి
సంయుక్త, చల్లూరు, రాజాపేట
రూపీకసయాలి, మోత్కూరు, యాదాద్రి భువనగిరి జిల్లా



మనుశ్రీ, పీపల్‌పహాడ్, చౌటుప్పల్
రియాన్ష్, ఇస్కిల్లా, రామన్నపేట
ఆయాన్ష్, ఇస్కిల్లా, రామన్నపేట
గుర్రం శ్రావణి, ఈశ్వర్, పల్లెర్ల, ఆత్మకూర్(ఎం)
రియాన్ష్, లింగారెడ్డిగూడెం, చౌటుప్పల్
సుశాంత్, చౌటుప్పల్
దేవాన్ష్, జలాల్‌పూర్, పోచంపల్లి
మెట్టు శ్రీహిత, దుప్పెల్లి, వలిగొండ
బింగి నిహంత్, ఆలేరు
క్రితిక, బీబీనగర్



శివాన్ష్, మోత్కూరు
వాస చేతన్‌కుమార్, హైందవి, భువనగిరి
చంద్ర తేజ్, తేజస్విత, భువనగిరి
జెస్సికా, అకిరానంద్, భువనగిరి
నైనిక, భువనగిరి
కోమలి, భువనగిరి
కీర్తిసహార, ఆధిత్య, భువనగిరి
కొలుగూరి పవన్‌సాగర్
లోకేష్, ఎస్. లింగోటం, చౌటుప్పల్
కొరుటూరి అభిక్షిత్, ఆలేరు

సినీ ఫక్కీలో దొంగతనం

- అల్లం మురబ్బ అమ్ముకునేందుకు వచ్చి 12తులాల బంగారం, రూ.25వేల నగదు చోరీ
- హిప్నాటిజం చేసి దోచుకెళ్లిన నిందితుడు
- ఆత్మకూరు(ఎం) మండలం తుక్కాపురంలో వెలుగులోకి..



దీనంగా కూర్చున్న స్వామి, కుటుంబ సభ్యులు

ఆత్మకూరు(ఎం): సినీ ఫక్కీలో హిప్నాటిజం చేసి గుర్తుతెలియని వ్యక్తి బంగారం, నగదు దోచుకెళ్లిన ఘటన ఆత్మకూరు(ఎం) మండలంలోని తుక్కాపురంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కాపురం గ్రామానికి చెందిన పొనగాని స్వామి, మల్లమ్మ భార్యాభర్తలు. వీరికి సంతోష్‌కుమార్, రవీందర్ కుమారులు. ఇద్దరు కుమారులకు వివాహాలు చేశారు. పెద్ద కుమారుడు సంతోష్‌కుమార్ తొమ్మిదేళ్ల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిన్న కుమారుడు రవీందర్ ఆరు నెలల క్రితం తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. ఇద్దరు కోడళ్లు గ్రామంలోనే స్వామి ఇంటి వద్దే ఉంటున్నారు. సోమవారం ఉదయం అల్లం మురబ్బా అమ్ముతామంటూ తెల్లని దుస్తులు ధరించిన ఓ వ్యక్తి పొనగాని స్వామి ఇంటికి వచ్చాడు. సదరు వ్యక్తి 'మీకు చేతబడి చేశారు. మీకు మంచిగా చేస్తాను' అని స్వామితో అన్నాడు. దీంతో స్వామి ఆ వ్యక్తిని ఇంట్లోకి పిలిచాడు. ఆ వ్యక్తి అడగగానే స్వామి భార్య మల్లమ్మ పసుపు తెచ్చి ఇచ్చింది. పెద్ద కోడలు వాణి మూడు పిడికిళ్ల బియ్యం, చిన్న కోడలు సుప్రజ పొయ్యిలో బొగ్గులు తెచ్చింది.

అల్లం మురబ్బ తినిపించి..

ఆ గుర్తుతెలియని వ్యక్తి స్వామితో పాటు అతడి భార్య, ఇద్దరు కోడళ్ల చేత అల్లం మురబ్బ తినిపించాడు. ఆ తర్వాత పసుపును వారికి రాసి హిప్నాటిజం చేశాడు. దీంతో నలుగురు ఆ వ్యక్తి ఎలా చెబితే అలా చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో మల్లమ్మ తన మెడలోని 6 తులాల బంగారు పుస్తెలతాడును తీసి అతడికి ఇచ్చింది. ఆ తర్వాత పెద్ద కోడలు తన మెడలోని 3 తులాల పుస్తెల తాడును, అదేవిధంగా చిన్న కోడలు మెడలో ఉన్న 3 తులాల పుస్తెల తాడును, స్వామి రూ.25 వేల నగదును ఆ వ్యక్తికి ఇచ్చారు.

మనవడు ప్రశ్నించడంతో వెలుగులోకి..

4వ తరగతి చదువుతున్న మల్లమ్మ మనుమడు యశ్వంత్ మంగళవారం ఉదయం నానమ్మతో పాటు పెద్దమ్మ, అమ్మ మెడలో పుస్తెలతాడు కనిపించకపోవడంతో ఏమయ్యాయని అడిగాడు. దీంతో వారు బీరువాలో ఉన్నాయంటూ చెప్పారు. స్వామి, మల్లమ్మ దంపతుల కుమార్తె సవిత మంగళవారం ఉదయం నుంచి ఎన్నిసార్లు ఫోన్ చేసినా వారు ఎత్తలేదు. మంగళవారం సాయంత్రం నలుగురు హిప్నాటిజం నుంచి బయటకు వచ్చిన తర్వాత సవిత ఫోన్ లిఫ్ట్ చేసి జరిగిందంతా ఆమెకు వివరించారు. దీంతో తాము మోసపోయినట్లు గ్రహించి ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నాగరాజు గ్రామానికి చేరుకొని బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని మహిళ సంచారం..

ఈ ఘటన జరిగే రెండు రోజుల ముందు గుర్తుతెలియని మహిళ చిక్కు వెంట్రుకలు కొంటామని గ్రామంలో సంచరించి పలువురి సమాచారం తెలుసుకుందని గ్రామస్తులు తెలిపారు. ఆమెను ఏ ఊరు అని అడగగా ఖమ్మం జిల్లా రాసాలనగర్ అని చెప్పిందని గ్రామస్తులు పేర్కొన్నారు. సదరు మహిళ స్వామి ఇంటికి కూడా వచ్చి వారితో మాటలు కలిపి 'రాంరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో, ఆరోగ్యం బాగాలేకున్నా మంచి చేస్తారని, ఆయనతో చూపించుకుంటే తనకు మంచి జరిగిందని చెప్పినట్లు తెలిసింది'.

విద్యార్థినుల మృతితో రెండు గ్రామాల్లో విషాదం



నక్కలపల్లిలో మనీషా మృతదేహానికి నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నల్లగొండలోని రాజీవ్‌పార్కులో మంగళవారం గడ్డిమందు తాగి పడిపోయిన మనీషా, శివాని

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని నక్కలపల్లికి చెందిన దొంతరబోయిన శివాని(18), అమ్మనబోలుకు చెందిన అనుగూతల మనీషా(18) నల్లగొండలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆ రెండు గ్రామాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. శివాని, మనీషా ఇద్దరూ నార్కట్‌పల్లిలో ఇంటర్(బైపీసీ) ఒకే కళాశాలలో చదివారు. అప్పుడే వారి మధ్య స్నేహం ఏర్పడింది. ఇంటర్ పూర్తయిన అనంతరం నల్లగొండలోని ప్రభుత్వ ఉమెన్స్ కాలేజీలో బీఎస్సీలో చేరారు. నల్లగొండలోనే ఎస్సీ ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. నక్కలపల్లి గ్రామానికి చెందిన దొంతరబోయిన సైదులుకు ఒక కూతురు శివాని, ఒక కుమారుడు ఉన్నారు. తండ్రి గ్రామంలో వ్యవసాయకూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. శివాని గ్రామంలోని హైస్కూల్‌లో 10వ తరగతి వరకు చదివి ఇంటర్ నార్కట్‌పల్లిలో చదివింది. ఇదే మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన ఎనుగుత్తల మల్లయ్యకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు కాగా.. మనీష రెండో కూతురు. ఆమె 10వ తరగతి వరకు గ్రామంలోని హైస్కూల్‌లో, ఇంటర్ నార్కట్‌పల్లిలో చదివింది. తండ్రి రోజువారి కూలి చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 'నా బిడ్డను ఎవరో బెదిరించి సెల్ ఫోన్‌లో ఫొటోలు పెట్టారంట, అందుకే నా బిడ్డ గడ్డిమందు తాగి చనిపోయింది. నా బిడ్డను బెదిరించిన వాళ్లను పట్టుకోవాలి' అని శివాని తల్లి రేణుక వేడుకుంది. 'మా కూతురు కాలేజీకి పోతున్నా అని పొద్దున్నే వెళ్లిపోయింది. నల్లగొండలో గడ్డిమందు తాగి చనిపోయింది. ఫోన్ చేసి నాకు ఏమో అవుతుందని చెప్పింది. అంతే తప్ప ఏమైందో తెలియదు' అని మనీష తల్లిదండ్రులు మల్లయ్య, యాదమ్మ చెప్పారు.

గ్రామాలకు చేరిన మృతదేహాలు

శివాని, మనీషా మృతదేహాలకు బుధవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన తరువాత మధ్యాహ్నం వారి గ్రామాలకు తరలించారు. మృతదేహాలను చూడగానే కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామస్తులు కూడా కన్నీటిపర్యంతమయ్యారు. నక్కలపల్లిలో జరిగిన శివాని అంతిమ యాత్రలో ప్రజలంతా పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటలకు అంత్యక్రియలు ముగిశాయి. కాగా, మనీషా బాబాయ్ ముంబాయిలో ఉంటున్నందున ఆయన రాగానే మనీషా అంత్యక్రియలు అమ్మనబోలులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే పరామర్శ

మృతుల కుటుంబ సభ్యులను ఆయా గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి పరామర్శించారు. మృతదేహాలపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వీరి వెంట ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఈద మాదవి నర్సింహ్మ, బద్దం వరలక్ష్మి రాంరెడ్డి, ఎంపీటీసీలు కొంపెల్లి సైదులు, అంజయ్య, బాషపాక రవికుమార్ తదితరులు ఉన్నారు.



నార్కట్‌పల్లి: అమ్మనబోలులో మనీషా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువకులు

అత్తపై గొడ్డలితో దాడి చేసిన అల్లుడు

- భార్యను కాపురానికి పంపడం లేదనే కక్షతో ఘాతుకం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు.. విషమంగా ఆరోగ్యం
- పోలీసుల అదుపులో నిందితుడు
- మోత్కూరు మండలం రాగిబావి గ్రామంలో ఘటన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిచ్చమ్మ

మోత్కూరు: భార్యను కాపురానికి పంపడం లేదని అత్తపై అల్లుడు గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటన మోత్కూరు మండలంలోని రాగిబావి గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాగిబావి గ్రామానికి చెందిన జక్కుల పెంటయ్య, పిచ్చమ్మ దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు సంతానం. చిన్న కుమార్తె వరమ్మను రామన్నపేట మండలం ఎన్నారం గ్రామానికి చెందిన సూక రమేష్‌కు ఇచ్చి 12 ఏళ్ల క్రితం వివాహం చేశారు. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా రమేష్ బతుకుదెరువు నిమిత్తం భార్యాపిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 20 రోజుల క్రితం జరిగిన గొడవలో రమేష్ తన భార్య వరమ్మను కొట్టాడు. దీంతో వరమ్మ తల్లిగారి ఊరైన రాగిబావికి వచ్చింది. దీంతో రమేష్ రాగిబావికి వచ్చి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టడంతో.. భార్యాభర్తలిద్దరికి సర్దిచెప్పి నాలుగైదు రోజులు అయ్యాక వరమ్మ హైదరాబాద్ వస్తుందని చెప్పడంతో రమేష్ తిరిగి వెళ్లిపోయాడు. కానీ భార్య తిరిగి రాకపోవడంతో తన అత్త పిచ్చమ్మనే తన భార్యను పంపడం లేదని రమేష్ కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి రమేష్ మద్యం సేవించి రాగిబావి గ్రామానికి వచ్చాడు. నేరుగా అత్తగారింటికి వెళ్లి మంచంలో నిద్రిస్తున్న అత్త పిచ్చమ్మ తలను గొడ్డలితో నరికాడు. తీవ్ర రక్తస్రావంతో ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు మేల్కొనడంతో రమేష్ అక్కడి నుంచి పరారయ్యాడు. పిచ్చమ్మను కుటుంబ సభ్యులు 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని మేడిపల్లిలో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అపస్మారకస్థితిలో ఉన్న పిచ్చమ్మ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చి గ్రామంలో రమేష్ కోసం గాలించగా.. ఓ ఇంటి వద్ద దాక్కున్న అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మోత్కూరు ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి నిందితుడు రమేష్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పిచ్చమ్మ కోడలు సంతోష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.